# అక్టోబర్ 30 వరకు ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు

**నర్సాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ బిఏ, బికాం, బిఎస్సీ కోర్సుల్లో చేరడానికి అక్టోబర్ 30వ తేదీవరకు గడువు పొడిగించడం జరిగిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరడానికి ఫీజు వివరాలు వైబ్‌సెట్‌లో చూడ వచ్చున్నారు. ఇంటర్మీడియెట్ నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వార ఇంటర్ పూర్తి చేసిన వారు పాలిటెక్నిక్,ఐటిఐ కోర్సుల్లో 2022 వరకు పాసైన విద్యార్థులు నేరుగా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందటానికి అర్హులని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో చదవచ్చని తెలిపారు. ఇంటర్ తత్సమాన అర్హతగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ద్వితీయ,తృతీయ సంవత్సర విధ్యార్థులు కోర్సు ఫీజు కూడ అక్టోబర్ 30 తేదీలోపు చెల్లించుకోవాలన్నారు. ఈ మేరకు పూర్తి వివరాల కోసం7382929736 పోన్ నెంబర్ కు పోన్ చేసి సంప్రదించాలని కోఆర్డినేటర్ ఎల్ నరెందర్ తెలియజేశారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# తెలంగాణ ఉద్యమకారుడికి ఘన నివాళి

**అల్లాదుర్గం, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ కారుడు వీరప్ప మహరాజ్ మృతి సమాజానికి కుటుంబీకులకు తీరనిలోటని అల్లాదుర్గం నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు, బిజెపి నాయకులు కంచరి బ్రహ్మం, జిల్లా కార్యవర్గ సభ్యులు కాల రాములు అన్నారు. రేగోడ్ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాధనకోసం పోరాడిన వీరప్ప మహరాజ్ మృతిచెందడంపట్ల వారి కుటుంబీకులకు ప్రగఢసానుభూతిని తెలియజేసి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మం, రాములు మాట్లాడుతూ వీరప్ప మహరాజ్ తెలంగాణ ఉద్యమ సమయంలో పలు జిల్లాల్లో సైకిల్ యాత్రచేసి తెలంగాణ ప్రజలకు చైతన్యపరిచి, తెలంగాణ రాష్ట్ర అవశ్యకతను ప్రజలకు తెలిపిన గొప్పవ్యక్తిఅయిన వీరప్ప మహరాజ్ మృతిపట్ల తెలంగాణ సమాజానికి, కుటుంబీకులకు తీరనిలోటన్నారు. ఇలాంటి ఎందరో ఉద్యమకారులు తెలంగాణ వ్యాప్తంగా ఉన్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి సముచిత గౌరవాన్ని అందేవిధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు ప్రభాకర్, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.



జప్తి_నాచారంలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గ్రామస్తులు

## జప్తినాచారం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు

**టిఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడి రాజీనామాలు**

**అవకతవకలకు పాల్పడినవారి శవ యాత్ర.. దిష్టిబొమ్మ దహనం**

**అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి**

**కొండపాక, అక్టోబర్ 18, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని జప్తినాచారం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని అరోపిస్తూ టిఅర్ఎస్‌కు చెందిన సీనియర్ నాయకులు,కార్యకర్తలు మూకుమ్మడిగా 150 మంది మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా గ్రంధాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపిటిసి చింతల సాయిబాబా, సర్పంచ్ కనకయ్య కలిసి డబుల్ బెడ్ రూం కేటాయింపులో తుది జాబితాలో ఉన్న అర్హుల పేర్లను తొలిగించి వారికి కావాల్సి వారికీ అనర్హులకు కేటాయించారని అరోపిస్తూ టిఅర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. డబుల్ బెడ్ఇళ్ల కేటాయింపులో అవకతవకలకు పాల్పడినరని అరోపిస్తూ వారి శవ యాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను గూడులేని పేదలకు కేటాయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో టిఅర్ఎస్‌కు చెందిన కొంత మంది నాయకులు ఎన్ని అక్రమాలకు పాల్పడిన పార్టీ పెద్దలు పట్టించుకోవడం లేదని అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నామని తెలిపారు. సిఎం ఇలాకాలో కెసిఅర్ గెలుపును నిర్దేశించే కొండపాక మండలంలో కొంత మంది నాయకుల ఒంటెద్దు పోకడ వలన పార్టీ సీనియర్ నాయకులు క్రమంగా టిఅర్ఎస్‌కు దూరం అవుతున్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక





జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

**జహీరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** జాతీయ స్థాయి పోటీలకు మండలంలోని హోతి(కె) గ్రామ శివారులోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16వ తారీఖున మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14, అండర్ 17 వాలీబాల, కో-కో పోటీలలో పాఠశాల విద్యార్థినులు 7 మంది వాలీ బాల్, 9 మంది కో-కో పోటీల్లో ప్రతిభ చాటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాలిన విద్యార్థినులను పంజాబ్ రాష్ట్రం జలందర్‌లో ఈ నెల 28వ తేదీన జరిగే జాతీయ స్థాయి వాలీబాల్, కో-కో పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి జహీరాబాద్ పేరు మారమ్రోగేలా చేయాలని జహీరాబాద్ ప్రాంత ప్రజలు ఆకాక్షిస్తున్నారు.

## మునుగోడులో బిఎస్పీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అలిగే జీవన్ తదితరులు

**సంగారెడ్డి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మునుగోడులో బిఎస్పీ నాయకులు శంకరరచారి తరపున నారాయణఖేడ్ నియోజకవర్గ నాయకులు అలిగే జీవన్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ శంకరచారిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మునుగోడు ఎన్నికల ప్రచార సరళిపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమీక్ష

**పటాన్‌చెరువు, అక్టోబరు 18, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్‌లో నిర్వహిస్తున్న శాసనసభ ఉప ఎన్నికల ప్రచా రంపై మంగళవారం చౌటుప్పల్ ఇంచార్జి, పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమీక్షించారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చౌటుప్పల్ ప్రజాప్రతినిధులతో కలిసి ప్రచారం తీరు పై ఆరా తీశారు. గడప గడపకు వెళ్లి టిఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్రంలోని ప్రతిపల్లె అభివృద్ధి పనులతో దూసుకు పోతున్న వివరాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయానికి ప్రతి కార్యకర్త సైనికునిలా పనిచేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వివరించారు.



ఎన్నికల ప్రచారసరళిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

దుబ్బాకనియోజకవర్గంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులకు సూచించారు. కలెక్టర్‌లో మంగళవారం దుబ్బాక నియోజకవర్గంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలపై జిల్లా అధికారులు, కాంట్రాక్టర్లు, నిర్మాణా ఏజెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలలో ఎలాగైతే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణలు పూర్తిచేశారో అదే తరహాలో పట్టుదలతో దుబ్బాక నియోజకవర గంలోనూ పూర్తి చేయాలన్నారు.నియోజకవర్గంలో మంజూరైన అన్ని ఇళ్లను పూర్తిచేసి లబి ధ్దారుల లిస్ట్ తయారు చేయాల న్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీని వాస్, డబుల్‌బెడ్‌రూం నోడల్ ఆఫీసర్ శ్యాం ప్రసాద్ రెడ్డి, కాంట్రాక్టర్లు, నిర్మాణా ఏజెన్సీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**మన ఊరు మన బడి పథకం పనులపై సమీక్షా**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి పథకం పనితీరు సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలలో బాగుందని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో దుబ్బాక నియోజకవర్గ పరిధిలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంఎస్ చైర్మన్లు, ఏంఈఓలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఎఈఓలు, గ్రామాల సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లతో మన ఊరు మన బడి పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యంత ముఖ్యమైన పనులైన భోజనశాల, వంట గది, మరుగుదొడ్లపై ప్రత్యేక శ్రద్దపెట్టాలన్నారు. ఎంపిడిఓలుచ ఎంపిఓలు పర్యటించి ఎన్ఆర్ఈజీఎస్, ఈజీఎస్ కింద చేపట్టిన పనుల్లో వేగం పెంచాలన్నారు. ఒక లక్ష్యం పెట్టుకొని త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. ఎఈలు రికార్డు చేసి అన్‌లైన్ చేపిస్తే డబ్బులు మంజూరు చేస్తామన్నారు. పాఠశాలల్లో చేపట్టిన పనులు బాధ్యతగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమం

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**డిసిపి సందెపోగు మహేందర్**

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 18, ప్రభాతవార్త :**

క్రీడల్లో గెలుపోటములు సహజమని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు సందెపోగు మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14,16, 18,20 సంవత్సరాల బాలబాలికల క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లాలన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, డాక్టర్ కొంకొండ ప్రభు తదితరులు మాట్లాడారు. కాగా ఈనెలలో హన్మకొండలో నిర్వహించిన పురుషులు, మహిళా విభాగంలో పాల్గొని 4వ సీనియర్ రాష్ట్రస్థాయి ఛాంపియన్ పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను డీసీపీ మహేందర్ సన్మానించారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీసీపీ అడ్మిన్ మహేందర్

కార్యక్రమంలో పీడీలు శ్రీని వాస్, సైక్లింగ్ అసోసియేషన్, టెన్నికాయిట్ అసోసి యేషన్ అధ్యక్షులు కాటం శ్రీనివాస్, ప్రధాన కార్య దర్శి ఖ్యాతం రాజకుమార్, పీడీ సుజాత, పీటీ సువర్ణలత, ఉప్పలయ్య, వెంకటనర్సయ్య, ప్రేమ్ కుమార్, రంగనాథ్,కనకారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, కృష్ణ కుమార్, భాస్కర్‌గౌడ్, నిశాంక్‌గౌడ్, కళ్యాణి, అనంద్ పాల్గొన్నారు. క్రీడల్లో 300 మంది పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్స్‌తో పాటు మెడల్స్ ప్రధానం చేస్తామని నిర్వహకులు తెలిపారు. ఈనెల 23,24వ తేదీలో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న గోదావరి అంజిరెడ్డి

## నాంపల్లిలో బిజెపి ఇంటింటి ప్రచారం

**పటాన్‌చెరువు, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం నాంపల్లి పట్టణంలో గోదావరి అంజిరెడ్డి కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిజెపికి ఓటువేయాలని ప్రజలకు గోదావరి అభ్యర్థించారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇంచార్జి సింగపురం గిరి, సాంబశివ, మల్లేశ్, పూల చిన్న వెంకటేయ్య, రాములు, లక్ష్మణ్ గౌడ్, బీజెవైఎం రామచంద్రాపురం పట్టణ అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**సిర్గాపూర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మండలపరిధిలోని కడ్పల్ గ్రామానికి చెందిన బార్దె సాయమ్మ కొన్నినెలల క్రితం మృతిచెందింది.ఆమె భర్త సాయిలు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పాలసీని చేయించాడు. ఆమె మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా ప్రభుత్వం మంజూరు చేసింది. మంగళవారం కుటుంబ సభ్యులకు బ్యాంకు మేనేజర్ గణేష్ రూ. రెండు లక్షల చెక్కును అందజేశారు. కార్యక్ర మంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయిరాజ్, క్యాషియర్ జగదీష్, బ్యాంకు మిత్ర అనిత, జడ్పీటీసీ రాఘవరెడ్డి, సర్పంచ్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ రమేష్, ఉప సర్పంచ్ శ్యాంసన్,గ్రామస్థులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా కొండం శ్రీకాంత్‌రెడ్డి

**మిరుదొడ్డి, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జంగ పల్లి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కొండం శ్రీకాంత్ రెడ్డి పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శశిధర్‌శర్మ, పంతం వెంకట్రాజమ్, జిల్లా గౌరవాధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి సమక్షంలో రాష్ట్రశాఖ అమోదం తెలిపింది. రాష్ట్ర కార ్యదర్శిగా కొండం శ్రీకాంత్‌రెడ్డి నియామకం పట్ల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సోమగారి నాగిరెడ్డి, రాజిరెడ్డి, రాష్ట్ర బాధ్యులు ఎల్లేష్, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు చంద్రారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ది వెంకటేష్, కనకారెడ్డిలు అభినం దనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియ మించిన ఎమ్మెల్సీ కూర రఘోత్తరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, గౌరవాధ్యక్షులు, జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు

**నిజాంపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

ఆర్‌బీఎస్‌కే రాష్ట్రీయ (బాలస్వస్థ్య కార్యక్రమంలో) భాగంగా మంగళవారం రోజున నిజాంపేట మండల కేంద్రములోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు డాక్టర్లు సిద్దరాములు, సంతోషి ఆద్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్దరాములు మాటాడుతూ పిల్లల్లో కనిపించని స్వల్పకాలిక అనారోగ్య లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా ఉండేందుకు ఆర్‌బీఎస్‌కే ఎంతోగానో దోహదపడుతుందని అన్నారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ వయస్సు తగ్గట్టుగా బరువు కంటి సమస్యలు పుట్టుకతో వచ్చే లోపాలు వివిధ అనారోగ్య లక్షణాలను గుర్తించి ఉచితంగా మందులను అందజేశామన్నారు.కార్యక్రమంలో ఏఎన్ఎం జయంతి, ఫార్మసిస్ట్ రాజేష్, ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# సెల్లార్లలో వ్యాపారాలు-రోడ్లపైనే పార్కింగ్‌లు

**బాటసారులకు, వాహన చోదకులకు ట్రాఫిక్ తిప్పలు..ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లా కేంద్రంలోని సిద్దిపేటలో సెల్లార్లలో వ్యాపారాలు సాగుతుండడతో వాహనాదారులు రోడ్లపైన పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. దీంతో బాటసారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంగా అవతరించినప్పటి నుంచి ప్రతి నిత్యం ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం వచ్చిపోతుంటారు. భవనాలు నిర్మించే సమయంలో పార్కింగ్ కోసం సెల్లార్లు పేరిట అనుమతులు తీసుకొని తీరా భవనాల యజమానులు సెల్లార్లను వ్యాపారాల కోసం అద్దెకు ఇస్తుండడంతో వాహనాదారులు వాహనాలను రోడ్డపైన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి అయా మార్గల గుండా వెళ్ళే వారికి కష్టలు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని మెదక్, హైదారాబాద్, కమాన్, సుభాష్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సెల్లార్లను వ్యాపారాలకు వినియోగిస్తున్న మున్సిపల్ పాలక వర్గం అధికారలు పట్టించుకున్న పాపానపోవడం లేదు. ట్రాఫిక్ సమస్య తలెత్తున్న అధికారులు,మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతన్నారు.

**సుమారు 50 సెల్లార్లలో..**

సిద్దిపేట మున్సిపాలిటీలో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన సుమారు 50 సెల్లార్లలో వ్యాపారాలు సాగుతున్నట్లు సమాచారం. సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహించొద్దని మున్సిపల్ అధికారులు నామ్‌కేవాస్తుగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన సెల్లార్లలో వ్యాపారులు నిర్వహిస్తున్న పట్టించుకోకపోవడానికి అసలు మతులబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సెల్లార్లు వ్యాపారులకు వినియోగిస్తుండడంతో రోడ్లపై వాహనాలు పార్కింగ్‌చేస్తుండడంతో ప్రజలు అష్టకష్టాలు పడడం తోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిచోట్ల పెద్ద భవనాలు నిర్మించి దవాఖానాలకు, వ్యాపారాలకు అద్దెకు ఇస్తుండడంతో అక్కడికి వచ్చే వాహనదారులు పార్కింగ్ కోసం సెల్లార్లు లేక వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో అర్థంకాక భవనాల ఎదుట ఉన్న రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో బాటసారులకు, వాహనాచోదకులకు తిప్పలు తప్పడం లేదు. సెల్లార్లను వ్యాపారాలకు అద్దెకుఇస్తూ యజమానాలు లాభాలుఘటిస్తున్న ప్రజల ఇబ్బందులపై అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో బహిరంగంగానే ఈ తతంగంమంతా కొనసాగుతున్న అధికారులు, మున్సిపల్ పాలకవర్గం చర్యలు తీసు కోకపోవడంపై పలు అనుమానలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, అధి కారులు శాశ్వత ప్రతిపాథికన చర్యలు తీసుకుంటారో లేక యధావిధిగా నోటీషులకే పరిమితమవుతారో వేచి చూద్దాం.



రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

# దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే

**సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ**

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజాశర్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విపంచి కళ నిలయంలో నెహ్రు యువ కేంద్రం అధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ 2022, యువ స ంవాద్ ఇండియా2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ యువత తలుచుకుంటే ఏదైనా సాధిస్తారని తెలిపారు. యువత దేశ అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. దేశంలో అత్యధిక యువత కలిగిన దేశంగా ఉందని యువతను చక్కగా వినియోగించగలిగితే భారత దేశం ప్రప ంచంలోనే అత్యున్నతస్థాయికి చేరుతుందన్నారు. దేశంలో స్వచ్ఛత కలిగిన పట్టణంగా సిద్దిపేట ఒక రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. జిల్లా యువజన అధికారి రంజిత్ కుమార్ మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అంతకు ముందు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అట పాటలు చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమార్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మార్కండేయులు, అధ్యాపకులు డాక్టర్ హుస్సేన్, డాక్టర్ సువర్ణదేవి, అర్ట్ గా ్యలరీ రుస్తుం ప్రతినిధులు భాస్కర్, శ్రీకాంత్, బాలచందర్, నర్సింలు, పవన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

## రాయికోడ్‌లో 'కమ్యూనిటీ కాంటాక్ట్'

**-పత్రాలు లేని 42 వాహనాలు సీజ్ : డిఎస్‌పి రఘు**

**సంగారెడ్డి, అక్టోబరు 18, ప్రభాతవార్త:** నేరాల నిర్మూలనకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రాయికోడ్‌లో మంగళవారం తెల్లవారు జాము నిర్వహించినట్లు జహీరాబాద్ డివిజన్ డిఎస్‌పి రఘు పేర్కొన్నారు. రాయికోడ్‌లోని బుదగజంగం కాలనీలో తెల్లవారు జాము 5 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి వ్యక్తులను, వాహనాలను పోలీసులు పరిశీలించారు. పాత్రాలు లేని పలు వాహనాలను పోలీసు ఠాణాకు తరలించారు. జహీరాబాద్ రూరల్ సిఐ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్‌లో రాయికోడ్, హద్నూర్, ఝరాసంగం పోలీసు ఠాణాల ఎస్ఐలు ఏడుకొండలు, వినయ్‌కుమార్, అబ్దుల్ సమద్‌లతో పాటు ఆయా స్టేషన్‌ల ఎఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు. కాలనీలో ఎలాంటి పత్రాలు లేని 12 ఆటోలను, 30 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి ఠాణాకు తరలించినట్లు డిఎస్‌పి రఘు వివరించారు. ప్రజల రక్షణ, భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించం కోసం పోలీసులు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. గ్రామంలోని కొత్త వ్యక్తులకు విడిది కల్పించ వద్దని, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమా చారం అందించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని డిఎస్‌పి రఘు హెచ్చరించారు.



రాయికోడ్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్న డివిజన్ పోలీసులు



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం లోడ్‌లారీ

## అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

**గుజరాత్‌కి చెందిన లారీ సీజ్...సివిల్ సప్లై డిటికి అప్పగింత**

**రామాయంపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త :**

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని సోమవారం రాత్రి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకుని సీజ్ చేసి సివిల్‌సప్లై అధికారులకు అప్పగించారు. ఎస్ఐ రాజేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని గుడిమికల్‌లో గల రైస్‌మిల్ నుండి 30 టన్నుల పిడిఎస్ (రేషన్ బియ్యం) రైస్‌ను జీజె 04 ఏడబ్ల్యూ 7275 నంబరు గల లారీలో లోడ్ చేసుకొని గుజరాత్‌లోని భావల వద్దకు తరలిస్తుండగా మార్గమద్యంలో రామాయంపేట జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంతో లారీని పరిశీలించగా అందులో రేషన్‌బియ్యం ఉన్నాయని తెలిపారు. వెంటనే లారీ డ్రైవర్ ములోచు అష్రఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని మెదక్ సివిల్ సప్లై డిటికి అందజేసినట్లు ఎస్ఐ రాజేష్ వెల్లడించారు.

## బైక్‌ను ఢీకొన్న ఆటో...వ్యక్తి మృతి

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

బైక్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజేష్ కథనం ప్రకారం...రామాయంపేటకు చెందిన చిట్యాల వెంకట్‌రెడ్డి (50) సోమవారం నాడు ఉదయం 10.30 గంటల సమయంలో తన యొక్క మోటార్‌సైకిల్ ఏపీ 11 కె 5984 గల దానిపై గొలిపర్తి వైపు వెళ్తుండగా అంతలో టాటా ఏసీ ఏపీ 28 టీఏ 5528 నంబరు గల దాని డ్రైవర్ తన వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో ఢీకొట్టగా మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వెంకట్‌రెడ్డి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన రక్తగాయమవ్వగా స్థానికులు వెంటనే రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయగా, తరువాత ఈరోజు అనగా మంగళవారం నాడు అందాజ 10 గంటల సమయానికి మరింత మెరుగైన చికిత్స కోసం యశోద ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యంలో చనిపోయినట్లు మృతుడి అల్లుడు గంగుల సంజీవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న రమేష్

## ప్రాథమిక విద్య పటిష్టానికే 'తొలిమెట్టు'

**-జిల్లా విద్యాధికారి రమేష్**

**కొల్చారం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** ప్రాథమిక దశలో విద్యా బోధన పటిష్టం చేయడానికి తొలిమెట్టు కార్యక్రమం అని మెదక్ జిల్లా విద్యాధికారి రమేష్ అన్నారు. మంగళవారం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా కొల్చారంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేష్, సెక్టరు అధికారి సుభాష్‌లు సందర్శించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనను అదే విధంగా విద్యార్థులు భాగస్వామ్యాన్ని, బోధనోపకరణాల వినియోగం, తొలిమెట్టు రికార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రమేష్ మాట్లాడుతూ విద్యా బోధన ప్రాథమిక స్థాయి నుండి పునాది లాంటిదని, ప్రాథమిక స్థాయిలో విద్యా బోధనను పటిష్టం చేయడానికి ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమం పకడ్బందీగా అమలు జరుగుతుందని అన్నారు. తొలిమెట్టుతో విద్యార్థుల్లో విద్యా బోధన మెరుగు పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, సీఆర్‌పీలు బోజ్జ సంపత్, చౌరిగారి సాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకే ఉద్యోగావకాశం కల్పించాలి



ఐఎంఎల్ డిపో గేటు ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

**కొల్చారం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మండలపరిధిలోని చిన్నఘనపూర్ ఐఎంఎల్ డిపోలో స్థానికులకు ఉద్యోగావకాశం కల్పించాలని ఉప సర్పంచి లక్ష్మీనారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ డైరెక్టర్ పుల్లబోయిన మల్లేష్ డిమాండ్ చేశారు. చిన్నఘనపూర్ ఐఎంఎల్ డిపో ముందు మంగళవారం స్థానికులు పెద్దఎత్తున ధర్నా చేశారు. స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలని డీఎం నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం నాగేశ్వరరావు స్పందిస్తూ స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం ఉప సర్పంచి లక్ష్మీనారాయణగౌడ్, కాంగ్రెస్ నేత, సొసైటీ డైరెక్టర్ పుల్లబోయిన మల్లేష్‌లు మాట్లాడుతూ ఉపాధి అవకాశం లేక ఎంతో మంది ఉన్నత చదువులు చదువుకున్న యువత వలస పోతున్నారని, స్థానికంగా ఉన్న ఐఎంఎల్ డిపోలో మాత్రం స్థానికులకు కాకుండా స్థానికేతరులకు ఉద్యోగ అవకాశం ఇస్తున్నారని అన్నారు. స్థానికంగా ఉన్నవారికే ఉద్యోగ అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నఘనపూర్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు లాభదాయక పంటలను సాగు చేసుకోవాలి

**-జిల్లా వ్యవసాయాధికారి ఆశాకుమారి**



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఆశాకుమారి

**పెద్దశంకరంపేట, అక్టోబర్18 ప్రభాతవార్త:** రైతులు లాభదాయక పంటలను సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఆశాకుమారి అన్నారు. మంగళవారం క్రాప్‌బుకింగ్‌లో భాగంగా పెద్దశంకరంపేటలోపాటు టెంకటి, గోపనివెంకటాపూర్, బుజ్రాన్‌పల్లి గ్రామాల్లో వరి, పత్తి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పంటలు కొంతమేర దెబ్బతిన్నాయన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించి పంటలకు అవసరమైన క్రిమిసంహారక మందులను వాడాలన్నారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఖరీఫ్‌లో పంటలసాగు జిల్లాలో క్రాప్‌బుకింగ్ ఆధారంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఏవో రాజేష్ కుమార్, ఏఈవోలు స్వాతి, భవాని తదితరులు ఉన్నారు.

## పత్తిపంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



లింగంపల్లిలో పత్తిపంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**మెదక్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** రేగోడ్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారి జావీద్, వ్యవసాయ విస్తరణ అధికారి సునీల్ కేమార్ క్షేత్రస్థాయిలో పత్తి పంటలను పరిశీలించడం జరిగింది. గత 2, 3 రోజులుగా వర్షాలు కురవడంతో పత్తి పంటలో మొక్కల పెరుగుదల లేక గిడసాబారి, కాయలు తక్కువగా ఏర్పడి దిగుబడి తగ్గడం జరుగుతుంది. అంతేకాక అధిక వర్షాల వల్ల పత్తిపంట పూజేరియా ఎండు తెగులు సోకడం, కాయలు అనేవి గోధుమ రంగు నుండి నలుపు రంగులోకి మారడం జరిగింది. దీని నివారణకు పత్తిపంట పైన మంకోజేబ్ 30 గ్రామ్ లేదా కార్బండిజం 30 గ్రాములు, ప్లాంటమైసిన్ 1 గ్రామ్‌లతో కలిపి 10 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు వారు సూచనలు ఇవ్వడం జరిగింది.

## అద్దె యంత్రాలతో రైతులకు లాభం

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** జిల్లాలోని ఆయా మండలాల్లో ఏర్పాటుచేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్లు(అద్దె ప్రాతిపదికన యంత్రాలు) రైతులకు ఎంతో లాభదాయకంగా ఉన్నాయని జిల్లా ఫైనాన్స్ డీపీఎం సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో రైతులకు తక్కువ ధరకే అధునాతన యంత్రాలను అద్దెకు ఇవ్వడం కోసం కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరిన్ని మండలాల్లో ఈ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు యొహాన్, లక్ష్మణ్, సీవో సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

## పొంగుతున్న చెక్‌డ్యాంలు

**వెల్దుర్తి, అక్టోబర్18 ప్రభాతవార్త:** వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు హల్దీ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో పొంగిపొర్లుతుంది. ప్రాజెక్టు దిగువన హల్దీ వాగులో 9 చెక్‌డ్యాంలు ఉండగా వాటిలో సైతం భారీగా నీరు చేరడంతో మత్తడి పోస్తున్నాయి. దీంతో పాటు చెరువులు, కుంటలు సైతం భారీగా నీరు చేరడంతో జల కళను సంతరించుకొని అలుగు పోస్తున్నాయి. రైతులు వర్షాలు పడుతుండటంతో చేతికి అందివచ్చిన వరి పంట దెబ్బతింటుందని, ఇలాగే వర్షాలను కురిస్తే తాము నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

# కులవృత్తులకు ప్రభుత్వం పెద్ద పీట : ఎమ్మెల్యే



చెరువులో చేప పిల్లలను వదులుతున్నన ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

**కొమురవెల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు సిఎం కెసిఆర్ కులవృత్తులకు పెద్ద పీట వేస్తున్నారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం కొమురవెల్లిలోని మల్లన్న చెరువులో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎంపిపి తలారీ కీర్తన కిషన్, జడ్పిటీసీ సిలువేరు సిద్దప్ప, మల్లన్న ఆలయచైర్మన్ గీస బిక్షపతి, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ సు ంకరి మల్లేశం గౌడ్, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశంతో కలిసి 81 వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాల్లో మొత్తం 29 సంఘాలు ఉన్నాయని ఆ సంఘాల పరిధిలో ఉన్న చెరువు కుంటలలో దాదాపు 62 లక్షల చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. చేప పిల్లల పెంపకంతో మత్స్యకార్మికులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారని తెలిపారు. తెలంగాణలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే మోడీ వద్దంటున్నాడని..మోడీనే ప్రజలు వద్దంటున్నారన్నారు. అనంతరం బహుజన సాహిత్య అకాడమీ అధ్వర్యంలో నేషనల్ ఉత్తమ సేవ సర్పంచ్ అవార్డుకు ఎంపికైన రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్ విజయం సాధించితీరుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య, మండల కో-అప్షన్ సభ్యులు లాల్‌భగన్, ముది రాజ్ సంఘం మండల అధ్యక్షులు గొల్లపల్లి కిష్టయ్య, పీఎసిఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింహులుగౌడ్, టిఆర్ఎస్ నాయకులు ముత్యం నర్సింహులుగౌడ్, పడిగన్నగారి మల్లేశం, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కంట్రోలర్ ప్రసాద్‌కు సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఆర్ఎం జానకి రాములు

## సదాశివపేట బస్టాండ్‌ను సందర్శించిన డిప్యూటీ ఆర్ఎం

**సదాశివపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** టిఎస్ ఆర్టిసి మెదక్ రీజియన్ డిప్యూటి రీజినల్ మేనేజర్ జానకి రాములు మంగళవారం నాడు సదాశివపేట బస్టాండ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్ ఇంఛార్జ్ శివకుమార్‌ను బస్‌పాస్‌లకు సంబంధించిన వివరాలను అడిగారు. అనంతరం కార్గో సర్వీస్ సెంటర్ పనితీరును పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న దుకాణ సముదాయంలో ఉన్న ధరల పట్టికలను తనిఖీ చేశారు. అదే విధంగా పార్కింగ్‌కు సంబంధించిన స్థలవివరాలను యాజమాని సంగమేశ్వర్ కు అడిగారు. బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులలో ఎక్కువగా ప్రయాణించేలా చూడాలని కాంట్రోలర్ ప్రసాద్, బోంతప్పలను ఆదేశించారు. ఈ సందర్శనలో డిప్యూటీ ఆర్ఎం జానకి రాములు తోపాటు అసిస్టేంట్ సాయి ఉన్నారు.

## బోదకాలు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వైద్యాధికారులు

**బెజ్జంకి, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ వినోద్ బాబ్జీ. తోటపల్లి ప్రాథమిక అరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కీర్తన, మండల యూనాని వైద్యాధికారి డాక్టర్ నసీమా అధ్వర్యంలో బోదకాలు నివారణ చర్యలపై వైద్య సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోదకాలు అనే వ్యాధి లింపటిక్ ఫిలారాయాసిస్ అనే క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ ఫైలేరియా నివారణ మాత్రలు తీసుకునే విధంగా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 20,21,22వ తేదీలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లింగాల నిర్మల, వైద్య సిబ్బంది వసంత, సులోచన. కళావతి, జగన్, ఎఎన్ఎంలు, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మునుగోడు ఉప ఎన్నికల్లో మురళీయాదవ్ ప్రచారం

**నర్సాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గెలుపుకోసం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ తో కలిసి మున్సిపల్ చైర్మనన మురళీయాదవ్ మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి గెలుపు కోసం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీయాదవన మాట్లాడుతూ దేశ వ్రజలంతా బిజెపి పాలనను కోరుకుంటున్నారని, మునుగోడు ప్రజలు కూడ బిజెపి అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డి గెలుపు కోసం కమలం పువువకు ఓటు వేసి నరేంద్రమోడికి కారుకగా అందించేందుకు మునుగోడు ప్రజలు చూస్తున్నారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో మున్సిపలన చైర్మన్ మురళీయాదవ్ తో పాటు రింగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు ఉప ఎన్నికల ప్రచారం చేస్తున్న నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ తదితరులు



నగదు, బంగారాన్ని అందచేస్తున్న ఆర్టీసి సిబ్బంది

## నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ అధికారులు

**-బస్సులో మరచిన నగదు, బంగారం అందచేత**

**సంగారెడ్డి, అక్టోబరు 18, ప్రభాతవార్త:** ఆర్టీసి అధికారులు తమ నిజాయితీని మరో మారు చాటుకున్నారు. జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు హైద్రాబాద్ నుంచి జహీరాబాద్‌కు హైద్రాబాద్-2 డిపో బస్సులో 40వేల రూపాయల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు కల్గిని బ్యాగును బస్సులో మర్చిపోయారు. బస్సులో మరిచిపోయిన బ్యాగ్ విషయాన్ని జహీరాబాద్ డిపో అధికారులకు తెలియచేయగా వారి వద్ద ఉన్న టికెట్ ఆదారంగా హైద్రాబాద్ డిపో అధికారులతో సంప్రదించి బస్ కండక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించగా బస్సులో బ్యాగ్ ఉన్నట్లు కండక్టర్ ధృవీకరించారు. బస్‌లో మరిచిపోయిన బ్యాగ్‌ను జహీరాబాద్ డిపోకు వచ్చేలా చేసి సదరు మహిళలకు జహీరాబాద్ డిపో అధికారులు అందచేశారు. పోగొట్టుకున్న నగదు, బంగరు ఆభరాణాలు తిరిగి తమకు అందేలా చేసిన జహీరాబాద్ డిపో అధికారులకు మహిళలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## విద్యార్థిని ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం

**నర్సాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లకావత్ రమేశ్‌నాయక్ పేద విద్యార్థి ఉన్నత చదువుకోసం ఆర్థిక సహాయాన్ని అందించారు. నర్సాపూర్ మండలం తుకారాం తండాకు చెందిన రమావత్ గీతా కెజీబివిలో 2021 లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకొని ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్దే ఉంటుంది. నర్సాపూర్ జడ్‌పిహెచ్ ఉపాధ్యాయుల విషయాన్ని తెలుసుకొని గీత ఇంటికి వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నారు. చదువుకోవాలని ఉన్నప్పటికి ఆర్థిక పరిస్థితి బాగా లేక ఉన్నత చదువులు చదవ లేకపోతున్నానని గీత చెప్పింది. దీంతో ఆయన ఆమె చదువు కోసం 20 వేల 600 రూపాయిలు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సామ్యానాయక్, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందజేత

**నర్సాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** యువ క్రీడాకారుడికి యువజన కాంగ్రెసననాయకులు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేవారు. పట్టణంలోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో నివాసముంటున్న సిహెచ్ మల్లేషం కుమారుడు సాయికారుణ్య వరుణ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠవాలలో 10వ తరగతి చదువుతూ కలకత్తాలో నిర్వహించిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. త్వరలోనే న్యూఢిల్లీలో జరగనున్న అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు వెళుతున్న అతడికి ప్రధానోపాద్యాఉలు వీరేశం సమక్షంలో నర్సాపూర్ యువజన కాంగ్రెసనతరపున రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో నర్సాపూరననియోజకవర్గ యువజన కాంగ్రెసన అధ్యక్షులు రియాజనఅలీ, ఉపాధ్యక్షులు చార్ల సందీపన, ప్రధాన కార్యదరనఇశ సుధీర్గౌడ్, వసీం, శ్వింపేట మండల అధ్యక్షులు మన్నె శ్రీనివాస్, కౌడిపల్లి మండల అధ్యక్షులు ధనసింగ్, హత్నూర మండల అధ్యఉలు కృష్ణ, నర్సాపూర్ యూత్ కాంగ్రెసన సోసల్ మీడియా ఇంచార్జి మల్లేస్, యువజన కాంగ్రెస్ నాయకులు ఆనంద్, రామాగౌడ్, ఉపాధ్యాయులు సామ్యానాయక్ లక్ష్మినారాయణ, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

## రామారం గ్రామ మాజీ సర్పంచ్‌కు పరామర్శ

**రాయపోల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామారం గ్రామ మాజి సర్పంచ్ హనుమంతు గత 15 రోజుల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, దౌల్తాబాద్ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్ లు హనుమంతును వారి నివాసంలో మంగళవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో దౌల్తాబాద్ మండల వైస్ ఎంపీపీ అల్లి శేఖర్‌రెడ్డి, దౌల్తాబాద్ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు బండారు దేవేందర్, రాయపోల్ మండల టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇప్ప దయాకర్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, తూర్పు లక్ష్మన్ తదితరులు ఉన్నారు



మాజి సర్పంచ్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

# చెత్తను వర్మికంపోస్టు ఎరువుగా మార్చండి

**హుస్నాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త :** తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మి కంపోస్టుగా ఎరువును తయారు చేసుకుని మొక్కలకు వినియోగించుకోవాలని ఒకటవ వార్డు కౌన్సిలర్ కొంకటి నళినీదేవిరవీందర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మిర్యాల రమేష్, కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకరరెడ్డి, మహ్మద్ అయూబ్‌పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పర్యావరణ ఇంజినీర్ ప్రశాంత్, ప్రభాకర్, గడిపె సుమలత, ప్రజలు పాల్గొన్నారు.

**14వ వార్డులో కౌన్సిలర్ భూక్య సరోజన**

పట్టణంలోని పద్నాలుగవ వార్డులో తడి పొడి చెత్తపై అక్కడి కాలనీవాసులకు పద్నాలుగవ వార్డు కౌన్సిలర్ భూక్య సరోజన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెత్తను తరలించేందుకు తమ కాలనీకి వచ్చిన పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని భూక్య సరోజన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



తడి పొడి చెత్తపై అవగాహన కల్పించిన కౌన్సిలర్ కొంకటి నళినీదేవి

**మున్సిపల్ కార్మికుని కుటుంబాన్ని పరామర్శించిన పట్టణ ప్రజాప్రతినిధులు ..**

పట్టణ మున్సిపల్ కార్మికులు కొమ్ము రాజయ్య, పైసా శ్రీకాంత్‌ల తండ్రి లింగయ్య ఇటీవల పరమపదించడంతో ఆ కుటుంబాన్ని కలిసి ధైర్యం చెప్పేందుకు ఒకటవ వార్డు కౌన్సిలర్ నళినీదేవి భర్త డాక్టర్ కొంకటి రవి, కౌన్సిలర్ మిర్యాల రమేష్, కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకరరెడ్డి, మహ్మద్ అయూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## పేదవారికి అండగా టిఆర్ఎస్ ప్రభుత్వం

**ములుగు, అక్టోబర్ 18 (ప్రభాతవార్త):** పేదలు ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రులలో చేరి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టుకుంటూ వైద్యం చేయించుకొని ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబాలకు సిఎం సహాయనిధి అండగా నిలుస్తుందని వంటిమామిడి ఏఎంసి చైర్మన్ జహంగీర్, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిలు పేర్కొన్నారు. ములుగు మండల పరిధిలోని చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన డాకూరి మల్లేశం రోడ్డు ప్రమాదానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. చికిత్సకు అయిన ఖర్చుల బిల్లులతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.3 లక్షల 65వేలు సిఎం సహాయనిధి నుండి అతనికి మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును మంగళవారం ములుగు గ్రామపంచాయతీ కార్యాలయంలో మల్లేశంకు ఏఎంసి చైర్మన్ జహంగీర్, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దేవేందర్‌రెడ్డి, తెరాస నాయకులు మహేష్‌యాదవ్, శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్ నిమ్మకాయల గణేష్, కుమార్, కృష్ణ, మహేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధిగ్రస్థుని ఇంటి పరిసరాల్లో పరిశుభ్రం చేసిన ఆరోగ్య సిబ్బంది

**హుస్నాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త :** పట్టణంలోని పదవవార్డులోని జేరిపోతుల గణేష్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనమూనాలు సేకరించి డెంగ్యూవ్యాదిగా నిర్ధారణ గణేష్‌ను వార్డు కౌన్సిలర్ గోవిందు రవి సహకారంతో సిద్దిపేటలోని టిహబ్‌కు తరలించారు. అనంతరం గణేష్ ఇంటిని వైద్యబృందం సందర్శించి ఇంటి పరిసరాల్లో స్ప్రే చేయించి పూర్తిగా శుద్ధి చేయించారు. ఇందుకోసం దమ ఉత్పత్తి గుర్తించి లార్వాను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కీటక జనితవ్యాధుల నియంత్రణ అధికారి జి.రామూ ్మర్తి అక్కడి పదవ వార్డులోని ప్రజలకు సూచించారు. వారంలో ఒక రోజు పరిసరాల్లో స్ప్రే చేయించుకుంటూ అంతటా శుభ్రంగా ఉంచుకునేలా చూసుకోవాల్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు రవి, అధికారి రామ్మూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి సంపత్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఉల్లంగుల కనకయ్య, హెల్త్ అసిస్టెంట్ కె రవిందర్‌రెడ్డి, ఏఎన్ఎం ఇందిర, ఆశా కార్యకర్త గడిపె అనసూర్య ఉన్నారు.

## వడ్ల సంగయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

**మెదక్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** రేగోడ్‌మండలం కొత్వాల్పల్లి గ్రామంలో 15 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన వడ్ల సంగయ్య కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండటం శ్రీతిరుమల ఫౌండేషన్ ఆందలోల్ ప్రాథమిక సభ్యుల సంఘం దృష్టికి తీసుకువచ్చిన సందర్భంలో స్పందించిన సంఘ సభ్యులు వారి కుటుంబానికి ఒకనెలకు సరిపడా నిత్యావసర వస్తువులను సంఘం సభ్యుల చేత వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. మృతిచెందిన వడ్ల సంగయ్య భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉండగా ఉన్న స్థిరాస్తులు అమ్మి ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లు చేయగా ప్రస్తుతం భార్య, కుమారుడు మాత్రమే ఉండ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. వారి కుటుంబానికి ఈపాటి చిన్న సహాయం మా శ్రీ తిరుమల ఫౌండేషన్ తరపున అందించి, దాతల సహాయం కూడా కోరనైనది. ఈ కార్యక్రమంలో శ్రీ తిరుమల ఫౌండేషన్ సభ్యులు సంతోష్ కుమార్ గుప్తా, శ్రీకాంత్, గొల్ల ప్రభాకర్, గొల్ల దశరత్, పూర్ణచందర్, మంద దర్శన్, కొత్వాల్‌పల్లి గ్రామ సర్పంచ్ రవీందర్, పెద్దలు అత్తాఫ్ పటేల్, విద్యాకమిటీ చైర్మన్ సాయిలు, ముద్దం శ్రీనివాస్, కిష్టయ్య, సత్యనారాయణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**సంగారెడ్డి, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** పేదవారికి ఎప్పుడు నేనున్నానని భరోసా కల్పిస్తూ, ఎన్నో సందర్భాలలో దోమడుగు సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్ తనికి తోచిన సహాయం చేస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో మారు మూల పోచమ్మ మరణించినందున ఆమెకు సంతాపం తెలియజేస్తూ, ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలుసుకొని రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వారి వెంట పాలకవర్గ సభ్యులు ఎం రామ్‌రెడ్డి, రాజు, దోమడుగు గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు కె మురళి, నాయకులు ఏ రాజు, ఎం వెంకట్‌రెడ్డి, ఆర్ శేఖర్, ఎ శ్రీనివాస్, ఎం సామయ్య పాల్గొన్నారు.

## తడి పొడి చెత్తపై మహిళలకు అవగాహన

**సంగారెడ్డి, అక్టోబరు 18, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం తడి పొడిచెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ సెల్ఫీ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పట్టణ మిషన్ కో-ఆర్డినేటర్ బసంత్‌రెడ్డి అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేరు వేరుగా అందచేస్తే కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఇండ్లలో సేకరించిన తడి పొడి చెత్తను వేరు వేరు బుట్టలో వేసుకుని చెత్త సేకరణకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. తడి పొడి చెత్తను ఒకే దగ్గర వేస్తే కాలుష్యంతో అవస్థలు పడాల్సి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మెప్మా అధికారి అనిత, డ్వాక్రా మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



తడిపొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## బావిలో పడి వృద్ధుడి మృతి

**సంగారెడ్డి, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మూగజావాలను మేపుతూ ప్రమాదావశాస్తు వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన జహీరాబాద్ మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం... జహీరాబాద్ పట్టణం బందెలు కాలనీకి చెందిన మక్బూల్ అలీ (75) పశువులను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం పశువులను మేపుతూ పట్టణ శివారులోని చిన్న హైద్రాబాద్ ప్రాంతం వైపు వెళుతున్న క్రమంలో గ్రామానికి చెందిన కప్పె అంజయ్యకు చెందిన వ్యవసాయ బావిలో ప్రమాదావశాస్తు పడి మృతి చెందాడన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.

## ఆటోను ఢీకొన్న కంటైనర్..ఎనిమిది మందికి గాయాలు

**వెల్దుర్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేట నుండి ప్రయాణికులతో తూప్రాన్ వెళ్తున్న ఆటోను మాసాయిపేట సాయిబాబా ఆలయం ముందు 44వ జాతీయ రహదారిపై ఓ గుర్తు తెలియని కంటైనర్ వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మాసాయిపేటకు చెందిన చిన్న రాందర్శన్ ఆటోలో మంగళవారం ప్రయాణిలతో తూప్రాన్‌కు వెళ్తున్నారు. మాసాయిపేట సాయిబాబా ఆలయం ఎదురుగా 44వ జాతీయ రహదారికపై గుర్తు తెలియని కంటైనర్ వాహనం ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఏడుగురు ప్రయాణికులతో పాటు డ్రైవర్ సైతం గాయాలపాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారికి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



సంఘటన స్థలంలో క్షతగాత్రులు



కేంద్రానికి వ్యతిరేకంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

## కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాటం తప్పదు

### -300 మంది కార్మికుల బైక్ ర్యాలీ

**జిన్నారం, అక్టోబరు 18, ప్రభాతవార్త:** కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాటం తప్పదని అఖిలపక్ష నాయకులు అన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా మంగళవారం బొల్లారం పారిశ్రామికవాడలో కార్మికులు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్‌కెవీ జిల్లా నాయకులు వి.వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబరు 1వ తారీఖున కార్మిక వ్యతిరేక విధానాలపై అఖిలపక్ష నాయకులతో బొల్లారంలో సభను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్మిక వ్యతిరేక చట్టా లను రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నర్సింహారెడ్డి, రాజయ్య, గోవింద్‌రెడ్డి, రాజు, చక్రపాణి, హెచ్ఎంఎస్, సిఐటియు, టిఆర్ఎస్కెవి, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి పంటలపై రైతులకు అవగాహన

**న్యాల్‌కల్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** యాసంగిలో రైతులు పండించే శనగ, కుసుమ పంటల అధిక దిగుబడికి రైతులు తీసుకోవాల్సిన యాజమన్యా పద్దతులపై వ్యవసాయ సహాయ సంచాలకులు బిక్షపతి అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ముంగి గ్రామంలోని రైతు వేదికలో రైతులకు కుసుమ మినికిట్ బస్తాలను అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడిఏ బిక్షపతి, ఏఒ లావణ్య, ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డిలు మాట్లాడుతూ జీవ నియంత్రణ ఎరువులైన పిఎస్‌బిల వాడకంతో కలిఏ ప్రయోజనాలపై వివరించారు. కుసుమ ఐఎస్ఎఫ్-764రకం విత్తనాలను అక్టోబరు 15 నుంచి నవంబర్ మొదటి వారం వరకు విత్తుకోవాలని సూచించారు. తేమను నిల్పుకునే నల్ల రేగడి, నీటి వసతి గల ఎర్ర నేలలు పంట సాగుకు అనుకూలం అన్నారు. ఎకరానికి 4 కిలోల విత్తనం, అంతర్ పంట సాగుకైతే 2 కిలోల విత్తనాలు సరిపోతా యన్నారు. ఇటీవల కురిసన వర్షాలతో పత్తి పంటలో నీరు నిల్వ ఉంటే తీసివేసి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, 2 గ్రాముల ప్లాంటమైసెస్ లీటరు నీటిలో కలిపి మొక్క మొదట్లో పోసుకోవాలని సూచించారు. మండలానికి 450 కుసుమ విత్తనాల చిరు సంచులను సరఫరా చేశారని, క్లస్టర్‌ల వారిగా రైతులకు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి లావణ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఇఒ షరీఫ్, ముంగి, చినిగేపల్లి గ్రామాల రైతు బంధు సమితి అధ్యక్షులు నర్సింహారెడ్డి, రాంరెడ్డి, టేకూర్, రుక్మాపూర్ గ్రామాల సర్పంచులు అమీర్, స్వరూప నర్సింహారెడ్డి, రైతులు విఠల్‌రెడ్డి, నిరంజన్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

### బీరప్ప బస్తీ కాలనీలో నీటి సౌకర్యం



బోరుట్యాప్‌లను ప్రారంభిస్తున్న మున్సిపల్‌చైర్మన్ రోజాబాల్‌రెడ్డి

**జిన్నారం, అక్టోబరు 18, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధి లోని బీరప్ప బస్తీ 11వ వార్డులో తాగునీటి బోరును డ్రిల్ చేయించారు. బోరులో నీరు పుష్కలంగా లభ్యం కావడంతో కాలనీ వాసుల నీటి కష్టాలు తీరినాయని మున్సిపల్ చైర్మన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. బోరు నుంచి నీటి సరఫరాకు ఏర్పాటుచేసిన ట్యాప్‌లు మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంటన ప్రశాంత్, వాటర్‌సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో పందుల పట్టివేత



పందులను తీసుకెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

**అల్లాదుర్గం, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పందులను మంగళవారం గ్రామపంచాయతీ అధికారుల, సిబ్బంది పట్టుకొని తీసుకెళ్లారు. అల్లాదుర్గంలోని ఏ వాడలో చూసినా ఊర పందులు విచ్చల విడిగా జనసంచారం చేస్తున్నాయి. ఇళ్ల మధ్యలో పందులు తీరగడంతో ప్రజలు అనారోగ్యానికి గురిఅవుతున్నారు. అంతేకాకుండా అల్లాదుర్గం పరిసరా ప్రాంతాలైన జెడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలోపల వరకు సంచరిస్తూ, తరగతి గదులకు వెళుతున్నాయి. ఒకవైపు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తుంటే ఈ పందులను వరాండాల వరకు వెళ్తున్నాయంటే పందుల పరిస్థితి ఏలా ఉందో అర్థమవుతుందన్నారు. అంతేకాకుండా వసతి గృహాల వద్ద సంచరిస్తున్నారు. అలాగే అల్లాదుర్గం పరిసర ప్రాంతాల్లో వరి పంటలలో పడి ధ్వంసం చేస్తుండంతో రైతులు నష్టంపోతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు అల్లాదుర్గం సర్పంచ్ అంజి యాదవ్ దృష్టికి తీసుకురాగా సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఒక వాహనాన్ని తెప్పించి, అల్లాదుర్గంలో సంచరిస్తున్న ఊర్ల పందులను ఒక వ్యాన్ నిండా పట్టించి గ్రామంనుండి తరలించారు.

### నేడు టేక్మాల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**టేక్మాల్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయిలక్ష్మీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అనంతరెడ్డి మంగళవారం నాడొక ప్రకటలో తెలిపారు. లయన్స్‌క్లబ్ జోగిపేట ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరానికి ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ రవీందర్‌గౌడ్, శంకర్ నేత్రాలయం బల్కంపేట వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. 45 సంవత్సరాలు పైబడి అవసరమున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని, అవసరమైన వారికి ఆపేషన్లు ఉచితంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### గోమాయ ప్రమిదలతో దీపావళి జరుపుకుందాం

**తాండూరు, అక్టోబరు 18, ప్రభాతవార్త :**
గోమాయ ప్రమిదలతో దీపావళి పండగను జరుపుకొందామని.. బిజెపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత అన్నారు. మంగళవారం తాండూరులో వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు కల్వ సరిత, కార్యదర్శి గుబ్బ ప్రగతి, కోశాధికారి కొస్గి సరిత, కోట్రీక నాగలక్ష్మి, స్వప్నతో కలిసి గోమాయ ప్రమిదలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత మాట్లాడుతూ.. గోమయ ప్రమిదలతో దీపావళి పం డగను జరుపుకొవాలని... పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# డబ్బులు సంపాదించడమే వారి వృత్తి

### -ఇరానీ దొంగల ముఠాకు చెక్
### - ఇద్దరు ముఠా సభ్యుల రిమాండ్
### - వివరాలు వెల్లడించిన డిఎస్పీ శేఖర్‌గౌడ్

**తాండూరు, అక్టోబరు 18, ప్రభాతవార్త :**
చిన్నప్పటి నుండి సులువుగా డబ్బులు సంపాధించడమే వారి వృత్తి. ఓ వైపు కళ్ల అద్దాల వ్యాపారం చేస్తున్నట్లు నటిస్తూ.. చోరీలు, దారి దోపిడీలు చేయడమే వారి ప్రవృత్తిగా కొనసాగుతున్న కర్ణాటక రాష్ట్రం బిదర్‌లోని ఇరానీ గ్యాంగ్ దొంగల మూఠా సభ్యులకు తాండూరు పోలీసులు చెక్‌పెట్టారు. వికారాబాద్ జిల్లా తాండూరులో బ్యాంకులను టార్గెట్ చేస్తూ ప్రజలకు మాయమాటలు చెప్పి బురిడీ కొట్టించేందకు వచ్చిన ఇద్దరు ఇరానీ దొంగల మూఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం తాండూరు డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ శేఖర్‌గౌడ్ వివరాలను మీడియాకు వెళ్లడించారు. కర్ణాటక రాష్ట్రం బిదర్‌లోని చిద్రిరోడ్డు, హుసెన్ నగర్ కాలనీ, ఇరానీ గల్లికి నివాసముంటున్న నవాబ్(మజులుం) చిన్నప్పటి నుండి కష్టపడకుండా అబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తన అనుచరులతో కలిసి నిర్మానుష్య ప్రదేశాలలో బైక్‌లపై వెళ్తున్న ప్రజలను అడ్డగించి వారికి ఇంటలిజెన్స్, ప్రత్యేక పోలీసులం అంటూ మభ్యపెట్టడం, వినకపోతే వారి వద్ద ఉన్న కత్తితో చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడి వారి వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకొని పారిపోవడమే వారి వృత్తి అని డిఎస్పీ వివరించారు. వివిధ వేశాలతో ఒక రకమైన నేర పద్దతిని అవలంబిస్తూ దొంగతనాలకు పాల్పడేవారని తెలిపారు. అంతేకాకుండా వివిద ప్రాంతాలలో బ్యాంకులను టార్గెట్ చేస్తూ అక్కడికి వచ్చే నిరక్ష్యరాసులు, వృద్దులతో పాటు బ్యాంకులో నుండి తమ అవసరాలకు నగదును తీసు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ, (వెనకాల ముసుగులో ఇరానీ దొంగలు

కువెళ్తున్న ఖాతాదారులను గుర్తించి వారిని మాయ మాటలతో మభ్యపెట్టి వారి వద్ద నుండి చాకచక్యంగా అనుమానం రాకుండా డబ్బులను తస్కరించి కనిపించకుండా తప్పించుకుపోతారని చెప్పారు. దొంగతనాలు చేయడానికి ముందుగానే వారు ఇతర ప్రాంతాలలో దొంగతనం చేసిన బైక్‌ను తీసుకువచ్చి చోరీలకు పాల్పడుతారని అన్నారు. ప్రధాన నిందితుడైన నవాబ్ బ్యాంకులోకి చోరీకి వెళ్లగా తన అనుచరులను బయట బైక్‌పై ఉంచేవాడని, బ్యాంకుల వద్ద డబ్బులు కొట్టేసి బైక్‌పై పారిపోయేవారి తెలిపారు. గతంలో నవాబ్ అతని అనుచరులు ఇక్బాల్, మెహందిహసన్, మహ్మద్ అలీ తదితరులతో కలిసి సదాశివపేట్, కామారెడ్డి, వట్‌పల్లి తదితర ప్రాంతాలలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చారని అన్నారు. చివరగా 2019లో వట్‌పల్లి పోలీస్టేషన్ పరిధిలోని కేసులో జైలు నుండి వచ్చారని తెలిపారు. అప్పటి నుండి ఇప్పటి వరకు తిరిగి సంగారెడ్డిలో రెండు, ఆర్‌సి పురంలో 2, సదాశిపేట్ పరిధిలో 1, మియాపూర్‌లో 1, బిదర్‌లో 1, తాండూరులో 2కేసులు నమోదైనట్లు వివరించారు. కేసులలో పోలీసులకు చిక్కకుండా తప్పించుక తిరుగుతున్నాడని తెలిపారు. తాండూరులో బ్యాంకులను టార్గెట్ చేస్తూ చోరీకి పాల్పడటంతో సీఐ రాజేందర్‌రెడ్డి సిబ్బందితో బ్యాంకుల వద్ద నిఘా పెంచారని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని శాంతుమహాల్ టాకీస్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏడిబీ బ్యాంకులో డబ్బులను దొంగిలించేందకు వచ్చిన నవాబ్, అతని అనుచరుడు మహ్మద్ అలీని పోలీసులు చాకచక్యంగా పట్టుకోవడం జరిగిందని వివరించారు. క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు శివ, నర్సింలు, సాయప్ప, షబీర్‌లు దొంగతనానికి వచ్చిన నవాబ్‌ను పట్టుకునేందకు ప్రయత్నించగా కత్తితో దాడి చేసేందకు ప్రయత్నించాడని, కానిస్టేబుల్ నర్సింలు చేతిని కొరికి పారిపోయేందకు ప్రయత్నించారని, వెంటనే తేరుకొని సాహసంతో ఇద్దరు ఇరానీ దొంగలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగుతున్న ఇరానీ గ్యాంగ్ దొంగల మూఠా సభ్యులను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లను డిఎస్పీ అభినందించారు.

## జట్పీటీసీ ధారసింగ్ రాజీనామా చేయడం జీర్ణించుకలేకపోతున్నాం

### -కాంగ్రెస్ పార్టీ మాజీ జట్పిటిసి అంజన్న

**కోట్‌పల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త;**
పెద్దేముల్ జట్పీటీసీ ధారసింగ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిసి జీర్ణించుకలేకపోతున్నామని కాంగ్రెస్ పార్టీ మాజీ జట్పీటీసీ అంజన్న అన్నారు. మంగళవారం నాడు కోట్‌పల్లి మండల కేంద్రంలో అయన విలేకర్లు సమావేశం నిర్వహించి అయన మాట్లాడారు. అయన కాంగ్రెస్ పార్టీకి గత 30, సంవత్సరాలుగా రాజకీయం చేయడం పేదలకు ఎన్నో సేవాలు చేయడం జరిగిందన్నారు. అయన ప్రతి సంవత్సరంలో ఒక పదవిలో కోనసాగుతున్నారన్నారు. ఒక ఎస్టీ చెందిన ధారసింగ్ కాంగ్రెస్ పార్టీ నుండి తోలగించడం భాదకరమన్నారు. జరిగిందన్నారు. అయన మునుముందు ఎన్నో పదవులు అశించి అండదండలతో పెద్దముల్ మండల్ అధికార పార్టీ ఎన్ని విధాలుగా మభ్యపెట్టి రాజకీయ విషయంలో లోంగదిసిన అన్నిటికి తట్టుకున్నారన్నారు. అయన కాంగ్రెస్ పార్టీకి ముందుండి నడిపించడం జరిగిందన్నారు. అయన అండదండాలతోనే జట్పీటీసీగా మరియు పార్టీ ప్రెసిడెంట్‌గా చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీగా పని చేస్తున్నానన్నారు. కావున మాకు అయన అందుబాటులో రాలేదని మాకు అందుబాటులో వచ్చిన వెంటనే మేము కుడా పార్టీకి రాజీనామా చేసి అయన వెంట ఉంటామన్నారు.మా మండలం నుంచి ఇంకా పార్టీ కార్యకర్తలు కుడా మండల కమిటి కుడా రాజీనామా చేయడానికి మేము సిద్దంగా



కోట్‌పల్లి మండల కేంద్రంలో విలేకర్లు సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మాజీ జట్పీటీసీ అంజన్న

ఉన్నామన్నారు. ధారసింగ్ ఎట్టువైపు వేళ్తే అటూవైపు వేళ్తామన్నారు. అయన అండదండాలతోనే నేను ఎస్సీ జట్పీటీసీ అయ్యామన్నారు.అయన అండదండలతోనే అత్యధిక మోజార్టీతో గెలిపించరన్నారు. కావున అయనను కాంగ్రెస్ హైకమాండ్ పార్టీ నుంచి ఎలా తోలగించారనేది తెలువలే అని అన్నారు. అయన వెంటనే మేము కుడా ముందుండి నడుస్తామని వారు పేర్కోన్నారు, ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, రాంరెడ్డి, లక్ష్మినారాయణ, క్రిష్ణ, విరేశం, జెబ్బర్, సర్వర్,తదితరులు పాల్గోన్నారు.

## ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలి



**తలకొండపల్లి అక్టోబర్18,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో తపాల శాఖ వారి ప్రమాద బీమా ( గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్) పాలసిని 18 నుంచి 65 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ 399 చెలిస్తే 10లక్షల రూపాయల భీమా వర్తిస్తుందని అని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.మంగళవారం ఆయన 399 రూపాయలను చెల్లించి ప్రమాద భీమాను తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో జడ్పి కో ఆప్షన్ మెంబర్ మూజీబుర్ రహేమాన్,ఉప సర్పంచ్ అజీజ్,కార్యదర్శి శరత్,వార్డు సభ్యుడు శ్రీను,విజయ్ కుమార్,పెంటయ్య గౌడ్,శేఖర్,రాజు,బాలరాజు,రవి,సుల్తాన్,సాయి కారొబార్ రవి,చంద్రకళ, తపాలా శాఖ అధికారులు మౌనిక,శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబానికి ఆర్థిక సాయం



**చౌడపూర్ అక్టోబర్18,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని కన్మల్ కల్వ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ మేజర్ శివయ్య అనారోగ్య కారణాల వల్ల మృతి చెందాడు.విషయం తెలుసుకున్న పరిగి కాంగ్రెస్ యువ నాయకుడు డిసిసి అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి కుమారుడు రితిక్ రెడ్డి మరియు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్,మేజర్ శివయ్య పార్థీవ దేహనికి నివాళులర్పించి కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు.కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.అనంతరం బంగారంపల్లి గ్రామంలో మరణించిన కాంగ్రెస్ కార్యకర్త బుచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో పరిగి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్,రామకృష్ణ రెడ్డి,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాసయ్య,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నయ్య,బంగారం పల్లి కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,అమర్‌నాథ్ రెడ్డి,రమేష్,చౌడాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య,మందిపాల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుచ్చయ్య,కన్మాన్ కాల్వ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి,కన్మన్ కల్వ ఎంపిటిసి రాము,గ్రామ కమిటీ అధ్యక్షుడు ఖాదర్,మండల నాయకులు పాల్గొన్నారు.

## జోడో యాత్రపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాహాక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కొత్తూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త :**
రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న జోడో యాత్రలో భాగంగా ఈనెల 31వ తేదిన కొత్తూర్ మండల కేంద్రం నుండి వెళ్తున్న సందర్భంగా కొత్తూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విజయలక్ష్మి వద్ద తన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల సన్నాహాక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈనెల 31వ తేదీన మాజీ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అఖిల భారత జోడో యాత్ర షాద్‌నగర్ ప్రాంతంలో కొత్తూర్ మండలంలో అయ్యప్ప టెంపుల్ దగ్గర నుండి పాదయాత్ర ప్రారంభమవుతున్నదన్నారు. అలాగే రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రకు సంబంధించి బహిరంగ సభ, స్వాగతం పలికేందుకు పార్టీ కార్యకర్తల సమక్షంలో భారీ ఎత్తున్న ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌బిపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్, ప్రభాకర్‌రెడ్డి, దయానంద్‌గుప్త, రాందాస్‌నాయక్, పాశం కృష్ణ, వెంకట్‌రెడ్డి, తీగాపూర్ ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కృష్ణ, సిద్ధులు, రవినాయక్, శ్రీకాంత్, గోవింద్‌నాయక్, రామునాయక్, పాండురంగారెడ్డి, గోవిందనాయక్, రామునాయక్, అనంతయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల తీరుపై మండిపడిన టిటిడిపి అధ్యక్షుడు బక్కని నర్సింలు

### -అసలే అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు
### -పోలీసులతోనే మరింత ఇబ్బంది

**శంషాబాద్ అక్టోబర్18,ప్రభాతవార్త :**
హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై శంషాబాద్ వద్ద ట్రాఫిక్ పోలీసులు అతిగా ప్రవర్తిస్తూ ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారని తెలంగాణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు,షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మండిపడారు.జాతీయ రహదారిపై ప్రతి రోజు అనేక మంది ప్రముఖులు ప్రయాణిస్తూ ఉంటారని మరోవైపు హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై ప్రయాణించి ఎయిర్‌పోర్టుకు చేరుకునే వారిని ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు.వాహనాలపై ట్రాఫిక్ చలాన్లు లేనప్పటికి పదే పదే వాహనాలను నిలిపివేస్తూ ట్రాఫిక్ జామ్ కావడానికి కారకులవుతున్నారని దీనిపై ట్రాఫిక్ డిజిపికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.ఉదాహరణకు తానే ప్రతి రోజు షాద్‌నగర్ నుండి హైదరాబాద్‌లోని టిడిపి కార్యాలానికి వెళుతుంటానని అన్నారు.ప్రతిరోజు శంషాబాద్‌లో పోలీసులు వాహనాలను నిలిపివేసి చలాన్లను చెక్ చేస్తుండడంతో పది నిమిషాల నుండి 15 నిమిషాల వరకు ట్రాఫిక్ జామ్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.చెక్ చేసిన వాహనాలని ప్రతిరోజు చెక్ చేయడం వలన పోలీసుల సమయం వృధా అవ్వడంతో పాటు ఈ రోడ్డు మీద ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పిడిన తర్వాత ట్రాఫిక్ పోలీసులు తమ విధులను విస్మరించి కేవలం ఫోటోలు తీయడం చలాన్లు వసూల్ చేయడానికి పరిమితమయ్యారని అన్నారు.ట్రాఫిక్ జామ్ అయిన తమకు ఏమాత్రం సంబంధం లేనట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారని దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వం విధానాలేనని ఆయన అన్నారు.ప్రభుత్వం ట్రాఫిక్ పోలీసులను ఫోటోగ్రాఫర్లుగా కలెక్షన్ బాయ్స్‌గా మార్చి వేసిందని బక్కని నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇక్కడ ఏర్పాటు చేసిన అనధికారిక చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేసి పోలీసుల చేత ప్రజలకు ఉపయోగపడే విధంగా ట్రాఫిక్ క్రమబద్దీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.వాహనాలపై చలాన్లు పెండింగ్ ఉంటే చట్టబద్ధంగా నోటిసులు పంపించి వసూలు చేసుకోవాలని నడి రోడ్డుపై వాహనాలను నిలిపి వేసి ఇబ్బందులు సృష్టించడం ఎంత మాత్రం సమంజసం కాదని మండిపడ్డారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ, 60 వేలు అందజేస్తున్న వికారాబాద్ బిఆర్ఎస్ యువ నాయకులు వడ్ల నందు

**వికారాబాద్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**
వికారాబాద్ బిఆర్ఎస్ యువ నాయకులు వడ్ల నందు గారి సహకారంతో రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా పేదోడికి ఆరోగ్య సమస్య వస్తే కూడా నే నునాం టూ ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందిస్తూ పేదోడి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. అందులో భాగంగా వికారాబాద్ బిఆర్ఎస్ యువ నాయకులు వడ్ల నందు గారి సహకారంతో వికారాబాద్ మండలం, ద్యాచారం గ్రామానికి చెందిన బి.అనిత భర్త యాదయ్య గారికి రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధారూర్ వైస్ ఎంపీపీ విజయ్, కెరల్లి ఎంపిటిసి శ్రీనివాస్, కొండాపూర్ కలాన్ సర్పంచ్ పరమేష్,బిఆర్ఎస్ యువ నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలు సిఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి

**కీసర,అక్టోబర్18,ప్రభాతవార్తః**
నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి అన్నారు.మండల కేంద్రమైన కీసరలోని ఎస్‌సి కాలనీకి చెందిన కర్రె నర్సింహ్మాకి సీఎం రిలీఫ్ ఫండ్ కింద 55 వేల రూపాయలు మంజూరు అయింది.మంగళవారం తన నివాసంలో చెక్కును ఆమెకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు కొండంత అండగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందన్నారు. సీఎం సహయనిధి ద్వారా ఎంతో మంది పేద ప్రజలు లబ్ది పొందుతున్నారన్నారు. అనారోగ్యం కారణంగా బాధపడుతూ మెరుగైన వైద్య సేవలను పొందుతున్నారని పేదలకు సీఎం సహాయం వరంలాంటిదన్నారు.ప్రజల క్షేమమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని,పేద ప్రజలకు భరోసానిస్తున్న ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమని.పేదల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు.నిరుపేదలకు టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. అనారోగ్యం కారణాలతో ఎవరైన ఇబ్బందులు పడితే నా శాయశక్తులా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చినింగణి బాలరాజు,ప్రధాన కార్యదర్శి రాగుల గణేష్,జాయింట్ సెక్రటరీ శివరాజ్,యువత ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన మహేష్,నాయకులు శీలం మల్లేష్,సుమన్ బన్నీ,మిట్టపల్లి మహేష్‌గౌడ్,తాటి పాముల నరేందర్, దేవి,రామానుజం తదితరులు పాల్గొన్నారు.

### మునుగోడులో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు



మునుగోడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి

**షాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త :**
మునుగోడులో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని టీపీసీసీ కార్య దర్శి పీసరి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మునుగోడు మండలం గూడాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతి తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ.... ఈఉప ఎన్నికల్లో మునుగోడు ప్రజలను మోసం చేసిన టీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మాజీ మంత్రి పాల్వాయి ఎ.గోవర్ధన్‌రెడ్డి హయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. మునుగోడు అభివృద్ధి కోసం ఈ ప్రాంత ఆడబిడ్డ పాల్వాయి స్రవంతిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు కాంగ్రెస్‌ను ఓడించేందుకు చేస్తున్న కుట్రలు సాగవన్నారు. నవంబర్ 3వ తేదిన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ చేయి గుర్తుపై పెద్ద ఎత్తున్న ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

### ఆర్యవైశ్యులు సేవారంగంలో ముందుండాలి....

**షాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త :**
ఆర్యవైశ్యులు సేవారంగంలో ముందుండాలని వాసవీ క్లబ్ రిజియన్ చైర్మెన్ మనోజ్‌కుమార్, క్లబ్ జోన్ చైర్మెన్ నాగమల్లేశ్వర్‌రావు తెలిపారు. బిహెచ్ఐఎల్ ఆశోక్ నగరంలోని వాసవీ కళ్యాణమండపంలో నిర్వహించిన వాసవీ క్లబ్ వి105ఏ రికాన్ ఉత్తమ సేవల సత్కారాల సదస్సును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి షాబాద్ వాసవీ క్లబ్ అధ్యక్షురాలు రాధిక, ప్రధాన కార్యదర్శి పద్మ, కోశాధికారి ప్రశాంతిలు హాజరై ఉత్తమ సేవలకుగాను అవార్డులు అందుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు.

## యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

**మాడ్గుల, అక్టోబర్18,ప్రభాతవార్త:-**
మాడ్గుల మండలంలోని నాగిళ్లలో యువజన కాంగ్రెస్ నూవన కమిటీని ఎనుకున్నట్లు కల్వకుర్తి యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉడుతల నందీశ్వర్‌గౌడ్ తెలిపారు.అధ్యక్షులుగా చాట్ల శేకర్,కార్యనిర్వాహణ అధ్యక్షులుగా పులికంటి శేకర్,ఉపాధ్యక్షులుగా మర్రిపల్లి శివ,ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రియాజ్,కార్యవర్గ సభ్యులుగా శ్రీను,రాజు,నరేందర్,పాండులను ఎన్నుకునట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో యువజన కాంగ్రెస్ బాద్యతలు అప్పగించిన నాయకులకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు.రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు.



నూతన కమిటీతో నందీశ్వర్‌గౌడ్